నేడు భవాని జాతర

వాంకిడి, సెప్టెంబరు 2: మండలంలోని సరండి గ్రామ సమీపంలోని బోడగుట్ట వద్ద మంగళవారం భవానిమాత జాతర జరుగనుంది. పోలాల అమావాస్య పండుగ మరోసటి రోజు ప్రతిఏడాది ఇక్కడ జాతర నిర్వహిస్తారు. మండలం లోని చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి బోడ గుట్టపైన గల భవాని మాతను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ పేర్కొన్నారు.

విద్య ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మొబైల్ లైబ్రరీ



మొబైల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ఆసిఫాబాద్, సెప్టెం బరు 2: సమాజానికి విద్య ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మొబైల్‌రీడింగ్ లైబ్రరీని ఏర్పాటు చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో రీడింగ్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా మొబైల్‌రీడింగ్ లైబ్రరీవాహనాన్ని అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో కలిసికలెక్టర్‌ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 15మండలాల్లో ఈమొబైల్‌రీడింగ్ లైబ్రరీద్వారా సమాజానికిపిల్లలకు చదవడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం, 3నుంచి8సంవత్సరాల పిల్లలకు ప్రారంభదశలో పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేస్తామన్నారు. ఈవాహనం జిల్లాలో ఏడురోజులపాటు గ్రామగ్రామాన తిరుగుతుందన్నారు. వందలాది పుస్తకాలు ఈవాహనంలో అందుబాటులో ఉంటాయని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, రూమ్‌టురీడ్ ఇండియా జిల్లాలీడ్ జెన్నీఫర్, తదితరులు పాల్గొన్నారు.


నేడు షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు రాక

ఆసిఫాబాద్, సెప్టెంబరు 2: ఆసిఫాబాద్ జిల్లాకు మంగళవారం షెడ్యూల్ కులముల జాతీయకమిషన్‌సభ్యులు వడ్డెపల్లి రామచందర్ రానున్నట్లు కలెక్టర్ వెంకటేష్‌దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం11గంటలకు డైరెక్టర్ డా.సునీల్‌కుమార్‌బాబు, రీసెర్చ్‌ఆఫీసర్ డివరప్రసాద్, పీఎస్‌వీ క్రాంతికుమార్‌తో కలిసికలెక్టరేట్‌కు వస్తున్నారని సంబంధిత శాఖాధికారులు తగు ఏర్పాట్లతోపాటు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు.

అతివలకు బీమా

● అవగాహనతోనే ధీమా ● స్వయం సహాయక సంఘాల సభ్యులకు చేకూరనున్న ప్రయోజనం





వాంకిడి, సెప్టెంబరు 2: మహిళాశక్తి పేరుతో ప్రత్యేక రుణాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం అతివల కోసం బీమా పథకాలను సైతం అమల్లోకి తెచ్చింది. ఉచితంగా రుణబీమా, ప్రమాదబీమా పేరుతో రెండురకాల వసతులను కల్పిస్తోంది. పొదుపు సంఘం సభ్యురాలు మృతిచెందితే రుణం చెల్లించడం కుటుంబ సభ్యులకు భారంగా మారుతోంది. అలాగే అప్పు తీసుకున్న మహిళ ఏదైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రుణమాఫీతోపాటు ప్రమాదబీమా ద్వారా ఆర్థికసాయం అందనుంది. మార్చిలోనే రుణబీమా ప్రకటించగా తాజాగా ప్రమాదబీమాకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీచేసింది. ఈ రెండు పథకాలు గడిచిన మార్చి నుంచి అమల్లోకి వస్తున్నాయి.

87,000 మందికి ప్రయోజనం..

జిల్లా వ్యాప్తంగా 15మండలాల్లో 7946స్వయం సహాయక సంఘాలకు చెందిన 87 వేలమంది సభ్యులున్నారు. వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చిరు వ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, మహిళాశక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలు అందజేస్తున్నారు.

ప్రమాద బీమా రూ.10లక్షలు

పొదుపు సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మృతిచెందితే అలాంటి వారి కటుంబాలకు రూ.10లక్షల ఉచిత బీమా వర్తింపచేయనున్నారు. ఒకవేళ వంద శాతం వైకల్యం కలిగినా రూ.10లక్షలు అంది స్తారు. 50శాతం వైకల్యం కలిగితే రూ.5 లక్షలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళలకు పొదుపు అప్పు ఉంటే అది కూడా మాఫీ చేస్తారు.

గాయాలైన మహిళ అంగవైకల్యం తెలుపుతూ సదరం ధ్రువపత్రాలు, చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలు సమర్పించాలి. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. 18 నుంచి 60ఏళ్ల వయసున్న పొదుపు మహిళలకు ఇది వర్తిస్తుంది.

రుణ బీమా రూ.2లక్షలు

గ్రూపుగా ఒక్కో సంఘానికి రూ.5నుంచి రూ.20 లక్షల వరకు ప్రస్తుతం రుణాలు అందిస్తున్నారు. రుణం పొందిన మహిళల్లో ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి ఆమె కుటుంబ సభ్యులు చెల్లించాల్సి వచ్చే ది. అలా చెల్లించకపోతే ఆ ప్రభావం గ్రూపు సభ్యుల పై పడేది. ప్రస్తుతం పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణ బీమా వర్తింపచేస్తుంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే ఆమె కట్టాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది.



అవగాహన అవసరం

ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు పథకాలలో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపులవారు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపురుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. వీటి వివరాలు ఉండాలి. అయితే ఇలాంటి వాటిపై మహిళల్లో అవగాహన లేదు. రుణం పొందే సమయంలో మాత్రమే వీవోలు నమోదు చేస్తున్నారు. దీనిపై సెర్ప్, మెప్మా అధికారులు దృష్టిసారించాలి.

ఎంతో ప్రయోజనం..

మహేష్, ఏపీఎం, వాంకిడి



మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు రెండురకాల బీమా సౌకర్యం కల్పించడంవల్ల ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఈ నిర్ణయంతో వారి కుటుంబాలకు, రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. దీనిపై మహిళా సంఘాలకు అవాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

అధికారయంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది: కలెక్టర్



వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 2: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల రక్షణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఎడతెరిపిలేని వర్షాలతో వరద కారణంగా ఆసిఫాబాద్ మండలం మాలన్‌గొంది గ్రామపంచాయతీలోని తుంపల్లివాగుపై ఉన్న కల్వర్టు కొట్టుకుపోయి రహదారి దెబ్బతినడంతో సోమవారం తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండేతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రజలకు ఎలాంటిఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిత్యావసరాలు, వైద్యసేవలు ఇతర అత్యవసరసేవలు అందించేందుకు అధికారులు కృషిచేయాలని తెలిపారు. రహదారి సౌకర్యం కల్పించేందుకు వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్ ఈఈని ఆదేశించారు. ప్రజలసౌకర్యార్థం కలెక్టరట్‌లో కంట్రోల్‌రూం 6304686505ను ఏర్పాటు చేశామన్నారు.

సిర్పూర్(టి): మండల, గ్రామస్థాయి అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో ఉంటూ 24గంటలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం మండలంలోని పారిగాం, టోంకిని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణను వెంకట్రావుపేట, హుడ్కిలి గ్రామసమీపంలోని పెన్‌గంగా వంతెనపైనుంచి వరద నీరు వెళ్తుండడంతో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి ఉన్నప్పుడు ఇరువైపులా ఎవరినీ వెళ్లనివ్వవద్దని అన్నారు. రెవెన్యూ, పోలీసుసిబ్బంది బ్రిడ్జిల వద్ద బందోబస్తు నిర్వహించాలన్నారు. పారిగాం గ్రామంలో నీటమునిగిన పంటల నివేదికలను తయారు చేయాలని వ్యవసాయ శాఖాధికారు లను ఆదేశించారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

రైతులకు న్యాయం చేస్తాం: కలెక్టర్

కౌటాల: మహారాష్ట్ర ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వార్దా, ప్రాణహిత నదుల్లో ప్రవాహం పెరిగి తాటిపల్లి, వీర్దండి గ్రామాల్లో పత్తి, మిరపపంటలు నీటమునిగాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే సోమవారం వీర్దండి గ్రామంలో నీటమునిగిన పంటలను స్వయంగా పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. అయితే గ్రామంలో ఎక్కువగా కౌలు రైతులు ఉన్నట్లు వారికి కూడా న్యాయంచేయాలని కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కలెక్టర్‌కు విన్నవించారు. రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయనవెంట మార్కెట్‌కమిటీ ఛైర్మన్ సిద్దల దేవయ్య, తహసీల్దార్ పుష్పలత, ఎస్సై మధుకర్, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్, ఏఈవోలు పాల్గొన్నారు.

తెగిన కల్వర్టులు.. నీట మునిగిన పంటలు

ఆసిఫాబాద్: జిల్లాలో భారీవర్షాలకు ప్రాజెక్టులలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. కుమరం భీం ప్రాజెక్టులోకి 8,350క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరడంతో అయిదుగేట్లు పైకిఎత్తి 10,485క్యూసెక్కుల వరద నీటినికిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టులోకి 4500క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో మూడుగేట్లు ఎత్తి 10,080క్యూసెక్కుల వరదనీటిని కిందికి వదులుతున్నారు. గడిచిన 24 గంటల్లో జైనూరు మండలంలో అత్యధికంగా 158.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లాలోని ప్రాణహిత, పెన్‌గంగా, పెద్దవాగు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆసిఫాబాద్ మండలం మాలన్‌గొంది, అప్పపల్లి కల్వర్టులు కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి.

జైనూరులో 158.3మిల్లీమీటర్ల వర్షపాతం..

జిల్లాలోని జైనూరు మండలంలో 158.3మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదయింది. సిర్పూర్(యు)లో 90.5 మిల్లీమీటర్లు, తిర్యాణిలో 87.8, కెరమెరిలో 64.3, రెబ్బెనలో 62.5, లింగాపూర్‌లో 54.5, ఆసిఫాబాద్‌లో 45, వాంకిడిలో 31.3, పెంచికలపేటలో 29.5, దహెగాంలో 23.3,సిర్పూర్(టి)లో21.8, చింతలమానేపల్లిలో 20.3, బెజ్జూరులో 16.3, కాగజ్ నగర్‌లో 11, కౌటాలలో 8.8, వర్షపాతం నమోదు అయింది.

కెరమెరిలో భారీ వర్షం

కెరమెరి: వర్షాలతో మండలంలోని వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అనార్‌పల్లి, లక్మాపూర్ వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో అవతలివైపు ఉన్న లక్మాపూర్, శంకర్‌లొద్ది, జన్కాపూర్,కరంజీవాడతోపాటు పలుగ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే సాంగ్వి, కేలి(బి) గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో ఇందాపూర్, ఖైరి,గౌరి, లెండిగూడతో పాటు మహారాష్ట్రకు వెళ్లేవారు కొన్నిగంటల పాటు లోలెవల్ వంతెన వద్ద వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పెంచికలపేట: ఎగువన కురిసిన వర్షాలకు తోడు కుమరం భీంప్రాజెక్టు గేట్లు ఎత్తి వేయడంతో పెద్దవాగు, ప్రాణహితనది పొంగిపొర్లుతు న్నాయి. దీంతో మండలంలోని చెడ్వాయి, గుంట్లపేట, బొంబాయిగూడ, ఎల్కపల్లి, ఎల్లూరు, కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ, నందిగామ గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటపొలాలు నీటమునిగాయి. ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కెరమెరిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న అనార్‌పల్లి వాగు



పెంచికలపేటలో నీట మునిగిన పంటలు



సిర్పూర్(టి)లో ముంపుప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

అంగన్‌వాడీకేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలి



పెంచికలపేట మండలంలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

పెంచికలపేట, సెప్టెంబరు 2: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం మండలంలోని పోతెపల్లి గ్రామంలో అంగన్‌వాడీకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు అంగన్‌వాడీకేంద్రాల పరిసరాల్లో చెత్తచేరకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను మాజీసర్పంచ్ చంద్రమౌళి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రెండునెలల నుంచి మిషన్‌భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. వెంటనే అదనపు కలెక్టర్ సంబంధిత శాఖాధికారులకు ఫోన్‌చేసి రేపటిలోగా నీటిసరఫరా చేయాలని ఆదేశించారు. గుంట్లపేట గ్రామంలో అంగన్‌వాడీకేంద్రానికి సొంత భవనంలేక అద్దె భవనంలో కొనసాగుతుందని నూతన భవనం నిర్మించాలన్నారు. ప్రధాన రహదారులు వర్షాలకు బురదమయంగా మారి ఇబ్బందులు పడుతున్నామని గుంట్లపేట, పోతెపల్లి గ్రామాల ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయనవెంట తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఆల్బర్ట్ తదితరులున్నారు.

పెసరికుంట గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలి..

దహెగాం: మరో రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పెసరికుంట గ్రామప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దవాగు ఒడ్డున ఉన్న పెసరి కుంట గ్రామాన్ని సందర్శించి ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెసరికుంట గ్రామంలో లోతట్టు ప్రజలను బీబ్రా రైతువేదికకు తరలించాలని ఆదేశించారు. దహెగాంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తాళంవేసి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వైద్యాధికారితో ఫోన్ విచారించారు. ఆయనవెంట డీటీ లలిత, ఎంపీడీవో రాజేందర్, ఏపీఎం చంద్రశేఖర్, ఎంఆర్ఐ నాందేవ్ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట బీసీ సంఘం ఆధ్వర్యంలో నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 2: సమగ్ర కులగణన చేసిన బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్‌చేస్తూ సోమవారం రాష్ట్ర కమిటీపిలుపు మేరకు బీసీసంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుటధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంచినతరువాతే స్థానికసంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీసంఘం నాయకులు జక్కయ్య, మారుతి, శంకర్, బాలేష్, లహుకుమార్ పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 2: జిల్లాలో వైద్యశాఖలో నూతనంగా ఎంపికైన వారు బాధ్యతతో విధులు నిర్వహించాలని అదనపుకలెక్టర్ దాసరి వేణు అన్నారు. సోమవారం నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా జిల్లాలో వైద్య శాఖలో ఖాళీగా ఉన్న14 విభాగల్లోని 64పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన నిర్వహించిన భర్తీ ప్రక్రియలో జిల్లా వైద్యాధికారి తుకారాం భట్, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సజీవన్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రవికృష్ణ, సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ చెన్నకేశవులతో కలిసి సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 విభాగాలలో 64 పోస్టులు ఖాళీగా ఉండగా వాటి భర్తీ కోసం వివిధ దశల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఒక్కో పోస్టుకు ఇద్దరిని ఎంపిక చేశామని మెరిట్ అభ్యర్థి రానట్లయితే తరువాత అభ్యర్థికి అవకాశం కల్పిస్తామన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 2: ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించాలని సోమవారం సిర్పూరు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ రావిశ్రీనివాస్ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌటాల మండల కేంద్రంలో ప్రధానరహదారి పక్కన గల సాయిబాబాగుడి సమీపంలోని ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. కాగజ్‌నగర్, సిర్పూరు(టి), బెజ్జూరు, తదితర మండలాల్లో సైతం ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీ డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

కాగజ్‌నగర్/బెజ్జూరు, సెప్టెంబరు 2: కాగజ్‌నగర్, బెజ్జూరులో సోమవారం ఏపీ డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. ఆలయాల్లో పూజలు చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శ్రీనివాస్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి గజ్జల లక్ష్మణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి: జీఎం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 2: మందమర్రి ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం తనచాంబర్‌లో ఆయన మాట్లాడుతూ 2024-25ఆర్థిక సంవత్సరానికి 34లక్షల టన్నుల ఉత్పత్తిని నిర్దేశించామన్నారు. ఆగస్టువరకు 15లక్షల టన్నులు సాధించాల్సి ఉండగా 12.20లక్షల టన్నులు సాధించామన్నారు. అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషిచేస్తే ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, డీజీఎం వెంకటరమణ, ఐఈడీ రాజన్న, అధికారులు ప్రసాద్, మైత్రేయబంధు, ఆసీఫ్ పాల్గొన్నారు.

'రిటైర్డు కార్మికులకు 20లక్షల గ్రాట్యుటీ చెల్లించాలి'

మందమర్రి టౌన్, సెప్టెంబరు 2: సింగరేణిలో పనిచేస్తూ 2016నుంచి ఉద్యోగవిరమణ పొందిన కార్మికులకు 20లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు వెల్ది సుదర్శన్ పేర్కొన్నారు. సోమవారం హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ డబ్ల్యూసీఎల్‌లో 20లక్షల గ్రాట్యుటీ చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో ఈ విధానాన్ని అమలు చేయకపోవడంతో చాలామంది కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రిటైర్డుకార్మికులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'ప్రమోషన్ల విషయంలో న్యాయం చేయాలి'

రెబ్బెన, సెప్టెంబరు 2: బెల్లంపల్లి ఏరియాలో ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ విషయంలో న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకులు జీఎం ఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వేకెన్సీతో నిమిత్తం లేకుండా అందరికీ టైంబాండ్ ప్రకారం ప్రమోషన్ కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలోగోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్యమొగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వోటు జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 2: బదిలీపై శ్రీరాంపూర్ ఏరియాకు వచ్చిన ఎస్‌వోటు జీఎంఎస్ సత్యనారాయణను సింగరేణి మున్నూరుకాపు ఉద్యోగులు ఆదివారం జీఎం కార్యాలయంలో సన్మానించారు. ఆయన వివిధ హోదాల్లో పనిచేస్తూ సింగరేణికి సేవలందిస్తున్నారని కొనియాడారు. మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు ఉద్యోగులు పాల్గొన్నారు.

35శాతం లాభాల వాటా చెల్లించాలి: టీబీజీకేఎస్

మందమర్రి టౌన్, సెప్టెంబరు 2: సింగరేణిలో 2023-24 ఆర్థికసంవత్సరానికి సంస్థకు కార్మికులు సాధించిన లాభాలనుంచి 35 శాతంవాటా చెల్లించాలని సోమవారం మందమర్రి ఏరియాలోని కేకే5గని వద్ద టీబీజీకేఎస్ నాయకులు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఒ రాజశేఖర్, జె రవిందర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం పూర్తై9నెలలు కావస్తున్నా ఇంతవరకు లాభాలవాటా చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధ్రుతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరారెడ్డి, మల్లేష్, రవి, తోట శ్రీనివాస్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: టీబీజీకేఎస్ నాయకులు బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిఇన్‌చార్జి డీవైసీఎంవో స్టాలిన్‌బాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రవూఫ్, సత్యనారాయణ, బోగ్గిశ్రీనివాస్, సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్: ఎస్ఆర్‌పీ-3 గనిపై వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికులకు లాభాల వాటా అందించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కె సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీరాంపూర్ ఏరియాలోని అన్నిగనులపై మేనేజర్లు, అధికారులకు వినతిపత్రాలు అందించి యాజమాన్యానికి పంపాలని కోరారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో బండి రమేష్, దుర్గం రవికుమార్, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, రాజునాయక్, ఎండి లాల, రవిచంద్ర, రత్నాకర్ రెడ్డి, గోపీ నాయక్, సాదుల భాస్కర్, తదితరులు ఉన్నారు.

కాసిపేట: లాభాలవాటాను వెంటనే చెల్లించాలని కాసిపేట1,2గనుల మేనేజర్‌లకు సోమవారం టీబీజీకేఎస్ నాయకులు వినతిపత్రాలు అందించారు. అనంతరం ఐఎన్‌టీయూసీలో నుంచి టీబీజీకేఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, నాయకులు ఒడ్నాల రాజన్న, శివ, కారుకూరి తిరుపతి, సారంగపాణి, శ్రీనివాస్, పోశన్న, వెంకటేష్, సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్ కాస్టులో సోమవారం మేనేజర్ రమేష్‌కు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కమిటీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కన్వేయన్స్ డ్రైవర్లు సమస్యలు పరిష్కరించుకోండి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 2: కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ అన్నారు. కన్వేయన్స్ డ్రైవర్లవేతనం, సీఎంపీఎఫ్ సమస్యలపై సింగరేణి అద్దె వాహనాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సింగరేణి సంస్థచెల్లిస్తున్న వేతనాలను కన్వేయన్స్ డ్రైవర్లకు అందించాలని, వాటిని తగ్గించి ఇవ్వవద్దని, కంపెనీ నియమ నిబంధనల మేరకు డ్రైవర్ల పేరిట సీఎంపీఎఫ్ జమ చేయాలన్నారు. పనిగంటల సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్)మురళీధర్, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 92 శాతం ఉత్పత్తి

రెబ్బెన, సెప్టెంబరు 2: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో వార్షిక సంవత్సరంలో ఇప్పటి వరకు 92శాతం ఉత్పత్తి సాధించినట్టు జీఎం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఈ వార్షిక సంవత్సరంలో ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో ఇప్పటివరకు 14.50లక్షలటన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 13.33లక్షల టన్నుల ఉత్పత్తి సాధించినట్టు వివరంచారు. ఆగస్టులో 2,40,000టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 1,15,000 టన్నుల ఉత్పత్తి సాధించినట్టు వివరించారు.

'సీఐటీయూని చులకనగా చూడడం సరికాదు'

మందమర్రిటౌన్, సెప్టెంబరు 2: ఏరియాలోని కేకే5గని యాజమాన్యం కొన్ని సంఘాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ సీఐటీయూ యూనియన్‌ను చులకనగా చూస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. తమ యూనియన్ పట్ల అధికారులు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. అన్నిసంఘాలు సమానమేనని గని అధికారులు గుర్తించాలన్నారు.లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

భారీ వర్షాలతో పంటలకు ముప్పు

● అధిక తేమతో నిలిచిపోయిన పెరుగుదల ● చీడపీడలు.. తెగుళ్ల ఉధృతి

● ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణుల సూచన

నెన్నెల, సెప్టెంబరు 2: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. వరదనీరు రోజుల తరబడి పంట పొలాల్లో నిలిచి ఉంటోంది. భూమిలో అధిక తేమవల్ల పైరు ఎదుగుదల నిలిచి పోవడంతో పాటు చీడపీడలు, తెగుళ్ల ముప్పేట దాడి చేస్తాయని నిపుణులు అంటున్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు ముందు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.



పత్తి పంటలో నిలిచిన వరద నీరు

- పత్తి చేలో నిలిచిన వరద నీటిని బయ టకు వెళ్ళేలా చర్యలు చేపట్టాలి
- నీరు నిలిచిన పరిస్థితుల్లో పారమిల్ట్, ఎండు తెగులు (వేరుకుళ్లు)సోకి, మొక్కలు తలలు వాల్చి ఆకులు రంగు కోల్పోతాయి.
- వడలిన మొక్కలతో పాటు దాని చుట్టు ఉన్న మొక్కలన్నింటికి 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి మొక్క వేరు భాగం తడిసే విధంగా పోయాలి.
- అవసరాన్ని బట్టి ఎకరానికి 25 కేజీల యూరియా, పది కేజీల పోటాష్ మొక్క మొద ట్లో 5-6 సెంటిమీటర్ల ఎడంగా వేయాలి.
- పచ్చదోమ, పిండి నల్లి, వివిధ ఆకు మచ్చ తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది.
- వరిపంటలో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉంది.
- అగ్గి తెగులు లక్షణాలు గమనిస్తే 0.6 గ్రాముల ట్రైసైక్లోజెల్ మందును లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలి.
- కంది పంట అత్యంత సున్నితమైనది. నీటి నిల్వను, అధిక తేమను తట్టుకోదు. చేలల్లో నీటిని వెంటనే తీసి వేయాలి.
- చేలోని నీటిని తీసిన తరువాత లీటరు నీటికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా 2 గ్రాముల మెటలాక్సిల్ కలిపి వేరు భాగంలో, మొదలు దగ్గెర బాగా తడపాలి.
- మొక్క జొన్నలో అధిక వర్షాలతో భాస్వర లోపం ఏర్పడి మొక్కలు ఊదా రంగులోకి మారుతాయి.
- వర్షాధార పంటకు ఎకరానికి 20 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ వేయాలి.
- బ్యాక్టీరియా కాండం కుళ్లు నివారణకు 5 కేజీల బ్లీచింగ్ పౌడర్ వేసుకోవాలి.
- కత్తెర పురుగు ఆశిస్తే 0.3 మిల్లీ లీటర్ల క్లోరైంటిని పోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

జాగ్రత్తలతోనే పంటల రక్షణ



సుద్దాల ప్రేమ్‌కుమార్, వ్యవసాయ అధికారి

అధిక వర్షాలతో పత్తి, వరి, కంది పంటలకు నష్టం కలిగే అవకాశం ఉంది. రైతులు ముందు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాన్ని తగ్గించుకోవచ్చు. పత్తి పంటలో నీరు నిలి స్తే వీలైనంత త్వరగా తీసి వేయాలి. భూమిలో అధిక తేమ వల్లా మొక్కల ఎదుగుదల నిలిచి పోతుంది. వేరు కుళ్ల తెగులు సోకే అవకాశం ఉంటుంది. చీడపీడలు, తెగుళ్ల ఆశిస్తే నిపుణు లు సూచించిన మందులు పిచికారి చేసుకో వాలి. నత్రజని, పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

ముగిసిన అంత్యక్రియలు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 2: ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబ సభ్యుల అంత్యక్రియలు మంచిర్యాలలో సోమవారం ముగిసాయి. హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీసులు వెంకటేష్ (40), అతడి భార్య వర్షిణి (33), ఇద్దరు కుమారులు రిషికాంత్ (11), విహాంత్ (3)లు పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించగా ఆదివారం అర్ధరాత్రి రెడ్డికాలనీలోని వారి సొంత ఇంటికి తీసుకువచ్చారు. ఒకేసారి నలుగురిని కోల్పోయిన కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంతో అంత్యక్రియలు పూర్తిచేశారు. గోదావరి నదితీరంలోని శ్మశానవాటిక వరద ముంపునకు గురి కావడంతో మృత దేహాలను ఆండాలమ్మ కాలనీలో శ్మశానవాటికకు తరలించి దహన సంస్కారాలు చేశారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కుటుంబసభ్యులను పరామర్శించారు.

కుక్కల దాడిలో గాయాలు

నెన్నెల, సెప్టెంబరు 2: కుక్కల దాడిలో సోమవారం జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన దుర్గం సునీల్ తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై వెళ్తుండగా వెంబడించి కుడి కాలుకు మూడు చోట్ల కరిచాయి. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండలంలో పిచ్చి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. నెన్నెలలో ఇటీవల పలువురిపై దాడి చేసి గాయపరిచాయి. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇరువురి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 2: గంజాయి విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. సోమవారం నిందితుల అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడించారు. మారుతీనగర్‌కు చెందిన గోలివాడ సాయితేజ, మారుపల్లి సుకుమార్‌లు గద్దెరాగడికి చెందిన రాజు నుంచి గంజాయి కొనుగోలు చేశారు. వాటిని విక్రయించేందుకు చూస్తుండగా గ్రీన్ సిటీ సమీపంలో పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్సై సనత్‌కుమార్ పట్టుకున్నారని సీఐ తెలిపారు. వారి వద్ద నుండి 35 గంజాయి ప్యాకెట్లు (84 గ్రాములు)ను స్వాధీనం చేసుకొన్నామని, వాటి విలువ రూ.2వేలు ఉంటుందని తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

కోటపల్లి, సెప్టెంబరు 2: మండలంలోని పారుపెల్లి మద్యం దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ చేశారు. వైన్‌షాపు వెనక భాగంలోఉన్న తలుపులను పగులగొట్టి లోనికి చొరబడ్డారు. కౌంటర్‌లో ఉన్న రూ. 34 వేల నగదుతో పాటు రూ.1.75 లక్షల విలువైన మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. మద్యం దుకాణానికి అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతోపాటు హార్డ్ డిస్కులను ఎత్తుకెళ్ళారు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

వాగులో కొట్టుకుపోయి ఎద్దు మృతి

దండేపల్లి, సెప్టెంబరు 2: ద్వారకకు చెందిన మునిమడుగుల సతీష్ అనే రైతుకు చెందిన ఎద్దు సోమవారం వాగునీటి ప్రవాహంలో కొట్టుకు పోయి మృతి చెందింది. పొలాలఅమావాస్య సందర్భంగా గోదావరినది సమీపంలో వాగునీటిలో ఎద్దును కడిగేందుకు తీసుకువెళ్లగా నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు రూ.40 వేలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

వేమనపల్లి, సెప్టెంబరు 2: క్యాతనపల్లి గ్రామానికి చెందిన చటారి పున్నంకు చెందిన ఎద్దు సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందినట్లు యజమాని తెలిపాడు. ఎద్దు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి



బెల్లంపల్లి, మంచిర్యాలలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రి టౌన్, సెప్టెంబర్ 2: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ, దాని అనుబంధ సంఘాల నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, సింగిల్ విండో చైర్మన్ ప్రభాకర్‌రావు, పుల్లూరి లక్ష్మణ్‌లు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడానికి పాదయాత్ర చేశారని, పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉన్న గొప్ప నేత అని పేర్కొన్నారు. వైఎస్ఆర్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనిల్, సునిల్‌కుమార్, మహంత్ రవి, పోలు శ్రీనివాస్, ఎండి సజ్జు, ఇస్సాక్, జావేద్‌ఖాన్, సురేందర్, రాజు, రంజిత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జన్నారం: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మండల కేంద్రంలో నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రంమోహన్‌రెడ్డి, సుభాస్‌రెడ్డి, రియాజుద్దీన్, ముత్యం రాజన్న, రియాసత్ అలీ, మోసిన్‌ఖాన్, రాజ్‌కుమార్, తిరుపతి , గంగన్న, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు హాలులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నాయకులు నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్‌నీలకంటేశ్వర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా చేసిన సేవలను కొనియాడారు. నాయకులు జాడి నర్సయ్య, పలిగిరి కనకరాజు, రాజయ్య, క్రాంతి,చంద్రమోహన్, సంజీవ్, సోము, రవీందర్, మనోజ్, మహేష్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

కోటపల్లి, సెప్టెంబరు 2: మండలంలోని సూపాక గ్రామానికి చెందిన చెన్నూరి శృతి సోమవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. శృతికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108కు సమాచారం అందించగా అంబులెన్స్‌లో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో జనగామ వద్ద ఈఎంటీ షహబాజ్ అధికారుల సూచనలతో డెలివరీ చేయగా ఆడ శిశువు జన్మించినట్లు పేర్కొన్నారు. మెరుగైన వైద్యం కోసం చెన్నూరు ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. ఈఎంటీ, పైలెట్ సతీష్‌లను పలువురు అభినందించారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి

మందమర్రిరూరల్, సెప్టెంబరు 2: తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని సోమవారం తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్‌కుమార్ రాష్ట్ర ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు సీఈవోకు, కలెక్టర్ కుమార్ దీపక్‌కు లేఖలు రాశారు. ఈ వ్యాధిగ్రస్తులకు డెసవరాల్ ఇంజక్షన్‌లు, ఇన్‌ఫ్యూజాపంప్ డేకేర్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని, వ్యాధిగ్రస్తులను ఆరోగ్యశ్రీలో చేర్చి చికిత్స అందించాలన్నారు. వీరికి కావాల్సిన మందులు జిల్లాలో లేకపోవడంతో హైద్రాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందని, మంచిర్యాలలో మందులు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యతోనే విజ్ఞానం పెంపొందుతుంది

మందమర్రిటౌన్, సెప్టెంబరు 2: విద్యకు వయస్సుతో సంబంధం లేదని, విద్యతో విజ్ఞానం పెరుగుతుందని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బేతస్త ట్రస్టుతోపాటు లిటరసీ ట్రస్టు ఇండియా చెన్నై వారి సహకారంతో ఏర్పాటు చేసిన వయోజన కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బేతస్త చర్చి నిర్వాహకులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇది ఎంతో అభినందనీయమన్నారు. విద్య ద్వారా సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, విజయ్‌కుమార్, సాల్మన్, రమేష్ పాల్గొన్నారు.



వయోజన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ

రైతు రుణమాఫీ వివరాల సేకరణ



కాసిపేట, సెప్టెంబరు 2 : రైతుల పంట రుణమాఫీ పథకంలో రుణమాఫీ పొందని రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ అన్నారు. దేవాపూర్ యూనియన్ బ్యాంకు పరిధిలోని రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరించి రుణమాఫీ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన క్రీడా పోటీలు

హాజీపూర్, సెప్టెంబరు 2 : రాంపూర్‌లోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో నిర్వహిస్తున్న శ్రీసరస్వతి విద్యాపీఠం తెలంగాణ ప్రాంత రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు చామర్తి ఉమామహేశ్వర్‌రావు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యం, ఆనందం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెటిపేట మున్సిపల్ చైర్మన్ నలమాసు కాంతయ్య, ఆవాస విద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 2 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్) దరఖాస్తుల గడువు తేదీని ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించామని, అర్హులైన వారంతా అన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2023లో సెలెక్టు అయి, ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు, గతంలో సెలెక్ట్ అయి ప్రస్తుతం 10, 11, 12 తరగతి చదువుతున్న విద్యార్థులు అప్లికేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్లను పాఠశాల నోడల్ అధికారి అక్టోబర్ 15వ తేదీలోగా ఆన్‌లైన్ వెరిఫై చేసి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆ దరఖాస్తు ఫారాలను అందించాలని సూచించారు.

రహదారులపై నిలుస్తున్న వరద నీరు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో పట్టణంలోని రహదారులపై వరద నీరు నిలుస్తోంది. ప్రధాన రోడ్లతో పాటు పలు కాలనీల్లో వరద నీరు నిలుస్తోంది. గోదావరిఖని, మందమర్రి కోల్‌బెల్ట్ రోడ్డుపై నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రామన్ కాలనీ రాజన్నల వాడ రైల్వే బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. భాగ్యనగర్ కాలనీ, ఊరు రామకృష్ణాపూర్, ఊరు మందమర్రి, అంగడిబజార్ ఏరియాల్లో వరద నీరు నిలవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. డ్రైనేజీల్లో చెత్తా చెదారం నిండి దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. పట్టణంలోని ఆర్ఎంపీ వైద్య శాలలు కిక్కిరిసిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

మందమర్రి టౌన్, సెప్టెంబర్ 2 : పట్టణంలోని తాళ్లపెల్లి రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆరు నెలలుగా చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఫొటో, వీడియో అసోసియేషన్ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, అశోక్‌కుమార్, బద్రి సతీష్, అనిదర్ రెడ్డి, సాయిపవన్, పసుల రవి, హరికృష్ణ, నక్క తిరుపతి, మేడ సది, తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ

జన్నారం, సెప్టెంబరు 2: జన్నారంలోని చిరు వ్యాపారులకు సోమవారం రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ గొడుగులను అందజేశారు. రోడ్ల పక్కన కూర్చుని వ్యాపారం చేసే చిరు వ్యాపారులు వర్షాల వల్ల ఇబ్బందులు పడకూడదని గొడుగులు అందించినట్లు ఆయన తెలిపారు. మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తిరుపతి, సదాశివ, రాహుల్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

చింతలమానేపల్లి, సెప్టెంబరు 2: మహారాష్ట్రలోని అప్పపల్లినుంచి చింతలమానేపల్లి మండలం మీదుగా డోర్‌పల్లి, కొమ్ముగూడకు ఎలాంటి రశీదులు లేకుండా అక్రమంగా ఏడు పశువులనుతరలిస్తున్న బొలేరోవాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వాహనాన్ని సీజ్‌చేసి సందీప్, ముంజంకర్ సంతోష్, మహల్కర్ సోమలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శాంతి కమిటీ సమావేశం

బెజ్జూరు, సెప్టెంబరు 2: బెజ్జూరు పోలీసుస్టేషన్‌లో ముస్లింలు, గణేష్ మండపాల నిర్వాహకులతో సోమవారం పోలీసులు శాంతికమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఎస్సై విక్రమ్ మాట్లాడుతూ ఈద్‌మిలాద్ ఉన్‌నబీ, గణేష్‌నవరాత్రి ఉత్సవాలు ఒకేసారి వస్తున్నందున శాంతియుతంగా పండుగను జరుపుకోవాలన్నారు. అదేవిధంగా గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతులు తీసుకోవాల న్నారు.

చింతలమానేపల్లి/కెరమెరి/దహెగాం/జైనూరు: మండలాల్లో వినాయక చవితి పురస్కరించుకుని మండపాలు ఏర్పాటు చేసేవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సైలు నరేష్, విజయ్, రాజు, సాగర్ అన్నారు. నిమజ్జన ఉత్సవాలు పోలీసు వారి సూచనలతో నిర్వహించుకోవాలన్నారు.

కోడిపందెం నిర్వహిస్తున్న అయిదుగురిపై కేసు నమోదు



పట్టుబడిన వారితో పోలీసులు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 2: మండలంలోని ఆడెపల్లి గ్రామంలో కోడి పందాలు ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వీరినుంచి అయిదు కోడిపుంజులు, అయిదుకత్తులు, రూ.2120నగదు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నెన్నెల: మండలంలోని కోనంపేట శివారులోని కోడిపందాల స్థావరంపై సోమవారం సాయంత్రం దాడిచేసి ఎనిమిదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. డబ్బులు పెట్టి పందాలు కాస్తున్న ఎనిమిది మందితో పాటు రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు, ఐదు వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థుల ధర్నా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

కౌటాల, సెప్టెంబరు 2: మండలంలోని తలోడి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వర్షకాలంలో మురుగు నీరు ఇళ్లచుట్టూ చేరి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. వెంటనేసమస్యలు పరిష్కరించాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎంపీవో మహేందర్‌రెడ్డి గ్రామస్థులను కలిసి సమస్యలను నేరుగా పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

కాగజ్‌నగర్‌లో మంచు శివలింగం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 2: కాగజ్‌నగర్‌బజరంగ్‌దళ్ హనుమాన్ ఆలయంలో సోమవారం మంచు శివలింగాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజరి నారాయణశర్మ క్షీరాభిషేకం నిర్వహించారు. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా మంచుతో కూడిన శివలింగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు దర్శించుకొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య పండుగ

ఆసిఫాబాద్, సెప్టెంబరు 2: పొలాల పండగను జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రైతులు బసవన్నలను అందంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం దస్నాపూర్ నుంచి బసవన్నలతో పట్టణ ప్రధానవీధుల గుండా భారీప్రదర్శన నిర్వహించారు. గాంధీచౌక్‌లోని అంకమరాజు ఆలయానికి చేరుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, బాలేష్‌గౌడ్, నాయకులు విశాల్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)/లింగాపూర్/జైనూర్/వాంకిడి/పెంచికలపేట/కెరమెరి/దహెగాం/బెజ్జూరు/సిర్పూర్(టి)/కౌటాల/చింతలమానేపల్లి: మండలాల్లో సోమవారం పొలాల అమాస్య పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమఎడ్లను రంగులతో అలంకరించి తీర్చిదిద్దారు. మట్టితో చేసిన ఎడ్లప్రతిమలను ఇళ్లలో ప్రతిష్ఠించి పూజలుచేశారు. ఎడ్లకు పూలమాలలు, మెట్టెలుకట్టి పూజించారు. ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించి ఎడ్లతోకలిసి ప్రదక్షిణలు చేశారు. శ్రావణమాసం ఉపవాసలతో ఉన్న రైతులు సాయంత్రం తమ ఇళ్ల వద్ద ఎద్దులకు ప్రత్యేకపూజలు జరిపి ఉపవాసాలను విరమించారు. అనంతరం ఎడ్లకు నైవేద్యం తినిపించారు.



ఆసిఫాబాద్ పట్టణంలో సాయంత్రం జరిగిన ఊరేగింపులో పాల్గొన్న రైతులు



సిర్పూర్(యు)లో ఎడ్లతో చిన్నారులు



జైనూర్‌లో ఎడ్లతో రైతుల ప్రదక్షిణ



లింగాపూర్‌లో ఎడ్లతో రైతుల సందడి



వాంకిడిలో..



దహెగాంలో..

వైఎస్సార్ వర్ధంతి



ఆసిఫాబాద్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాగజ్‌నగర్‌లో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్‌సీ దండే విఠల్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 2: పట్టణంలో సోమవారం ఉమ్మడిఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీరాశ్యాంనాయక్, జక్కన్న, శంకర్, బాలేష్, మిలింద్, అబ్బు, తనాజీ, మారుతి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్‌లో సోమవారం మాజీసీఎం వైఎస్ఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి ఎమ్మెల్సీ పూలమాలలు వేశారు. అనంతరం ఆయనచేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ కార్యదర్శి హర్షద్‌హుస్సేన్ మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతి, కౌన్సిలర్ శరత్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మద్యంపై మహిళల సమరం

జైనూర్, సెప్టెంబరు 2: కొద్ది రోజుల నుంచి ఉషేగాంలో బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. మద్యం తాగిన మందుబాబులు కుటుంబ సభ్యులతో గొడవలు పడుతుండడంతో మండలంలోని ఉషేగాం మహిళలు గళం విప్పారు. మహిళలందరూ ఏకమై మద్యం అమ్ముతున్న బెల్టుషాపులపై విరుచుకుపడ్డారు. బెల్టు షాపుల్లోకి చొరబడి మద్యం సీసీలపై పెట్రోలు పోసి కాల్చేశారు. ఈ సందర్భంగా ఐకేపీ కోశాధికారి కుంర సుమిత్రబాయి మాట్లాడుతూ మండలంలో బెల్టుషాపులు నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయన్నారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పల్లెలు ప్రశాంతంగా ఉండేందుకు బెల్టుషాపులను సత్వరమే మూసి వేయించాలని ఆమె డిమాండ్ చేశారు.



మద్యం సీసాలను దహనం చేస్తున్న మహిళలు

దంచికొట్టిన వాన..

● అంధకారంలో గిరిజన గ్రామాలు

జైనూర్, సెప్టెంబరు 2: మండల వ్యాప్తంగా ఆది, సోమవారాల్లో వర్షం దంచి కొట్టింది. సాయంత్రం, రాత్రి సమ యాల్లో భారీ వర్షం కురవడంతో రోడ్లపై వరద పారింది. మురికికాలువలు, రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మురికినీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. అదేవిధంగా చెరువులకు జలకళ వచ్చింది. అడవిలో, చేనుపరిసరాల్లో నీరు పుష్కలంగా ప్రవహిస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం కురిసిన వర్షం మూలంగా విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో మండల వ్యాప్తంగా అంధకారం నెలకొంది. రాత్రంతా విద్యుత్‌సిబ్బంది శ్రమించారు. తెల్లవారుజాము వరకు జైనూరు టౌన్‌కు విద్యుత్ అందించగలిగారు. ఉదయం 9 గంటలకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా అయ్యేలా ఏఈ సాయికిరణ్ చర్యలు తీసుకున్నారు.

ఉప్పొంగిన జగదాంబ వాగు

లింగాపూర్, సెప్టెంబరు 2: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం, రాత్రి కురిసిన భారీ వర్షానికి జగదాంబ వాగు ఉప్పొంగింది. దీంతో దాని ఆనుకొని ఉన్న ముగ్గురి ఇళ్లలోకి వరద నీరు చేరింది. సోమవారం గిర్దావర్ ప్రదీప్‌కుమార్ వారి ఇళ్లను సందర్శించి వారికి ఎమ్మార్సీ భవనంలో తాత్కాలిక పునరావాసం కల్పించారు. వారికి నిత్యావసర సరుకులు అందించి వసతులను కల్పించారు. కార్యక్రమంలో విజేస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసుల నజర్

జైనూర్, సెప్టెంబరు 2: మండలకేంద్రంతోపాటు మారుమూల గ్రామాల్లో అనుమతి లేకుండా కొనసాగుతున్న బెల్టుషాపులపై పోలీసులు నిఘాపెట్టారు. నేడు మంగళవారం బొడగ పండుగ ఉన్నందున మాంసం, మద్యం సేవించిడం ఏజెన్సీలో అనవాయితీ. బొడగను అదునుగా తీసుకుంటు బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకానికి నిర్వాహ కులు సమయాత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో మారుమూల గ్రామాల్లో బెల్టు షాపుల్లో మద్యం క్రయవిక్రయాలు జరగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.





గూడెం గోదావరి వరకి వరద నీటి ఉద్ధృతి

ఎంసీహెచ్‌కు పొంచి ఉన్న వరద ముంపు

పేషెంట్లను జీజీహెచ్‌కు తరలింపు



ఎంసీహెచ్ నుంచి పేషెంట్లను తరలిస్తున్న సిబ్బంది

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరింది. ఆ నీటిని దిగువకు వదులుతుండటంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీ తీరంలో ఉన్న మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్)కి వరద ముంపు ప్రమాదం నెలకొంది. దీంతో సోమవారం అధికారులు అప్రమత్తమై ఆసుపత్రిలోని గర్భిణులు, బాలింతలను ఐబీ ప్రాంతంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)కి తరలించారు. అధికారుల సూచనల మేరకు పేషెంట్లు, వారి సహాయకులు వారి వెంట తెచ్చుకున్న సామగ్రితో వెళ్లారు. 102, 108 అంబులెన్స్‌ల ద్వారా గర్భిణులు, బాలింతలను, వారి సహాయకులను ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాగ్ పరిశీలించారు. ఆసుపత్రిలో 130 మంది ఇన్ పేషెంట్లు ఉన్నారని, వారందరిని జీజీహెచ్‌కు తరలించామన్నారు. వీరందరిని అక్కడకు తరలించడం వల్ల జీజీహెచ్ ఇరుకుగా మారనున్నందున ఇదివరకు అక్కడ చికిత్స పొందుతున్న కొంతమంది పేషెంట్లను 10 ప్రైవేటు ఆసుపత్రులకు తరలించామన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు తరలించిన పేషెంట్లందరికీ ప్రభుత్వ పరంగానే వైద్యం అందుతుందన్నారు.

యేటా ఇదే తంతు: గోదావరి నదీతీరంలో రూ.17.80 కోట్లు వెచ్చించి నిర్మించిన మాతా శిశు ఆసుపత్రికి యేటా వరద ముంపు పొంచి ఉంటోంది. నాలుగేళ్ళుగా వర్షాకాలం వచ్చిందంటే చాలు ముంపు భయంతో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలను తరలించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వర్షాకాలం సీజన్ మొత్తం ఎంసీహెచ్‌ను మూసి ఉంచడం, అందులోని పేషెంట్లకు జీజీహెచ్‌లో చికిత్స అందించడం పరిపాటిగా మారింది.జీజీహెచ్ సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ముంపు ప్రమాదమేమి లేదు

- ప్రజలు నిర్భయంగా ఉండవచ్చు
- ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్



ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

హాజీపూర్, సెప్టెంబరు 2:మంచిర్యాల నియోజకవర్గానికి ముంపు సమస్య లేదని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ఎల్లంపల్లి ప్రాజెక్టును ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీపీ భాస్కర్‌లతో కలిసి సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా వరదలతో ఇబ్బందులు పడితే కంట్రోల్‌రూం 08736-250501కు సమాచారం అందించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగువన ఉన్న కడెం, శ్రీరాంసాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో వరద ఉధృతి పెరిగిందని, అధికార యంత్రాంగం ప్రజల రక్షణ దిశగా విశేష కృషి చేస్తుందని తెలిపారు. కలెక్టర్ నేతృత్వంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అధికారులు చేపడుతున్న రక్షణ చర్యలకు ప్రజాప్రతినిధులు సహకరించాలని తెలిపారు. ఏసీపీ ప్రకాష్, మండల తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఎంపీడీవో మధు సూదన్, ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

పోటెత్తిన గోదావరి



- మంచిర్యాలలో నీట మునిగిన పుష్కరఘాట్, శ్మశాన వాటిక
- రాళ్లవాగు ఉప్పొంగడంతో ఇళ్లలోకి చేరిన వరద
- పునరావాస కేంద్రాలకు తరలిన బాధితులు
- ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం
- వరద ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు
- ఎంసీహెచ్ నుంచి బాలింతలు, శిశువుల తరలింపు

మంచిర్యాల వద్ద గోదావరి ఉధృతి

మంచిర్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి జిల్లాలోని పలు గ్రామాలు, కాలనీల్లోకి వరద నీరు చేరింది. దండేపల్లి మండలంలో 10.8 సె.మీ. వర్షపాతం నమోదుకాగా బెల్లంపల్లి మండలంలో 9.2 సెం.మీ., జన్నారం మండలంలో 8.8 సెం.మీ., చెన్నూరు మండలంలో 7.1 సెం.మీ వర్షం కురిసింది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. మంచిర్యాల వద్ద పుష్కరఘాట్ పూర్తిగా మునిగిపోయింది. గౌతమేశ్వరాలయం సమీపంలోకి వరద నీరు చేరింది. పాత మంచిర్యాలలోని శ్మశాన వాటిక నీట మునిగింది. గోదావరి నిండుగా ప్రవహిస్తుండటంతో అంత్యక్రియలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నది ఒడ్డున ఉన్న ప్రైవేటు శ్మశాన వాటిక కూడా పూర్తిగా నీట మునిగింది. దీంతో నదికి వెళ్లే దారిలో రోడ్డు పక్కనే దహన సంస్కారాలు నిర్వహించాల్సి వస్తోంది. యేటా గోదావరి ఉప్పొంగినప్పుడల్లా అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రాళ్లవాగు బ్యాక్ వాటర్‌తో మునిగిన ఇళ్లు

భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. గోదావరి నిండుగా ప్రవహిస్తుండటంతో వాగు నీరు నదిలో చేరే అవకాశం లేక పోటు కమ్ముతోంది. దీంతో లోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్ నగర్‌లోని 20 ఇళ్లలోకి నీరు చేరింది. వరద బాధితులను అధికారులు ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని భవన నిర్మాణ కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రానికి తరలించారు. కౌన్సిలర్ బదావత్ ప్రకాశ్‌నాయక్ నేతృత్వంలో పునరావాస కేంద్రంలో బాధితులకు ఆహారం, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేశారు. రాళ్లవాగు ఉప్పొంగడంతో ఆదిత్య ఎన్‌క్లేవ్ కాలనీ సమీపంలోకి నీరు చేరింది. పరిస్థితి ఇలాగే ఉంటే గతేడాది మాదిరిగా కాలనీ మొత్తం నీట మునిగే ప్రమాదం పొంచి ఉంది. పాత మంచిర్యాల లక్ష్మీనగర్ కాలనీలోని లోతట్టు ఇళ్లకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. రాళ్లవాగు బ్యాక్ వాటర్ ప్రస్తుతం ఇళ్ల సమీపంలోకి చేరింది. బైపాస్ రోడ్డు సమీపంలోని కాజువే వంతెన నీట మునిగింది. దీంతో రంగంపేట, పవర్‌సిటీ కాలనీ వాసులకు వాగు ఇవతలి వైపునకు రాక పోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ ఎన్టీఆర్ వరద ప్రాంతాలను సందర్శించి అధికారులను అప్రమత్తం చేశారు.

ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు నిలిచిపోగా, ఓబీ మట్టి తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీల్లో దాదాపు రూ.19.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లగా, రూ.6 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయాయి.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 2,78,326 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148 మీటర్లకు గాను ప్రస్తుతం 145.69 మీటర్ల ఎత్తుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 14.181 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో 32 గేట్లను ఒక మీటర్ ఎత్తు వరకు తెరిచి 4,02,023 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు.

నస్పూర్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని వదలడంతో దిగువకు భారీ వరద నీరు చేరింది. దీంతో దిగువ ప్రాంతాలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసి నది తీరానికి ఎవరూ వెళ్లకుండా ఇన్‌టెక్‌వెల్ వద్ద బందోబస్తు, బారికేట్లను ఏర్పాటు చేశారు. సీతారాంపల్లి తీరంలో గోదావరి నది వరదను తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ ఆకుల అశోక్, ఎస్సై నెల్కి సుగుణాకర్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్‌లు సందర్శించారు.. పట్టణంలోని వినూత్న కాలనీ వరద ప్రభావిత ప్రాంతాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు సందర్శించారు. కాలనీలోని లోతట్టు ప్రాంతాల వాసులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ళ వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజిత, కౌన్సిలర్ సీపతి సుమతిమల్లేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దండేపల్లి: గూడెం గోదావరి నది వద్ద వరద నీటి ఉధృతి పెరిగింది. మూడు రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసి నీటిని గోదావరిలోకి వదిలారు. గూడెం గోదావరి నదికి వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. గుడిరేవు నుంచి మొదలు గూడెం పరివాహక ప్రాంతంలో ఎవరూ గోదావరి నది వైపు వెళ్లకుండా అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

బెల్లంపల్లి: భారీ వర్షాలతో 33వ వార్డులోని ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. హనుమాన్ బస్తీ-రామ్‌నగర్ బస్తీల మధ్యలో ఉన్న బ్రిడ్జిపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇండ్లలోకి నీరు చేరడంతోపాటు పాములు, ఇతర విష కీటకాలు వస్తున్నాయని ప్రజలు భయపడుతున్నారు. కౌన్సిలర్ పోలు ఉమాదేవిశ్రీనివాస్ నీరు చేరిన లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కోటపల్లి: భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని నక్కలపల్లి దారిలో లోతొర్రె పొంగి పొర్లింది. మరో వైపు బ్రహ్మణపల్లి గ్రామం వద్ద మత్తడి వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దిగువకు వస్తున్న వరద నీరుతో పాటు వర్షాలతో వాగులు, వంకల నుంచి వరదతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పారుపెల్లి నుంచి దేవులవాడ వరకు నది తీవ్రత అధికంగా ఉంది. వెంచపల్లి నుంచి అర్జునగుట్ట వరకు ప్రాణహిత ప్రవాహం ఒడ్డపాలెం వరకు ప్రవహిస్తోంది.

చెన్నూరు: ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని దిగువకు వదులుతుండడంతో చెన్నూరు వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. సోమనపల్లి, టీరెల్లి, నాగాపూర్, పొక్కూరు, నర్సక్కపేట, సుందరసాల, వెంకంపేట, నారాయణపూర్, చెన్నూరు, చింతలపల్లి నది పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డప్పు చాటింపు చేయించారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దు

జైపూర్: మత్స్యకారులు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్ఐ శ్రీధర్‌లు పేర్కొన్నారు. టేకుమట్లలో రెండు ఇండ్లు, షెట్‌పల్లిలో మూడు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. ప్రజలు గోదావరి పరిసరాల్లోకి వెళ్ల వద్దని సూచించారు. వేలాల పుష్కరఘాట్, సుందిళ్ల బ్యారేజీ వద్ద నీటి ఉధృతిని పరిశీలించారు.

భీమారం:మండలంలోని పలు ప్రాజెక్టులు, రహదారులను తహసీల్దార్ సదానందం, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణలు పరిశీలించారు. ఖాజీపల్లి వాగు వంతెన, నర్సింగాపూర్, బూరుగుపల్లి చెరువు, గొల్లవాగు ప్రాజెక్టు, పోలంపల్లి వాగు, ఎల్కేశ్వరం, మద్దికల్, ఆరేపల్లి గ్రామాల్లోని వాగులను పరిశీలించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని గోదావరి నది పరవళ్లు తొక్కుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని వదులుతుండడంతో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుంది. వారం రోజుల క్రితం గోదావరి నది ఇసుక మేటలతో కనిపించగా రెండు రోజులుగా గోదావరి ఉప్పొంగి ప్రహిస్తూ పుష్కరఘాట్ల వద్దకు నీరు చేరింది. దీంతో గోదావరి నది చూడడానికి ప్రజలు తరలివస్తున్నారు. ఎన్‌టీఆర్ నగర్, రామ్ నగర్ ప్రాంతాలకు నీరు చేరే అవకాశం ఉండడంతో అధికారులు రక్షణ చర్యలు చేపడుతున్నారు.

జన్నారం: భారీ వర్షంతో ఆదివారం రాత్రి గంట సేపు రోటిగూడ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జన్నారం వాగు ఉప్పొంగడంతో పక్కనే ఉన్న బుడగ జంగాల కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కలమడుగుకు చెందిన పోశమల్లు, పొనకల్‌లో దుర్గం లక్ష్మీ, తపాలపూర్‌లో లక్ష్మీలకు చెందిన ఇండ్లు కూలిపోయాయి. కలమడుగు, రాంపూర్, దేవునిగూడ గ్రామాల్లో ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, ఎస్ఐ రాజవర్ధన్‌లు పరిస్థితులను పరిశీలించారు. బుడగ జంగాల కాలనీ వాసులకు మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ భోజన సౌకర్యం కల్పించారు.

ఉధృతంగా ప్రాణహిత

వేమనపల్లి: భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో వేమనపల్లి సరిహద్దు గుండా ప్రవహిస్తున్న ప్రాణహిత నది సోమవారం సాయంత్రం నుంచి ఉప్పొంగుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేష్ హెచ్చరించారు. సుంపుటం, ముక్కిడిగూడెం, వేమనపల్లి, రాచర్ల, గొర్లపల్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




జిల్లా కేంద్రంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి నది



చెన్నూరు వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి నది



సీతారాంపల్లి వద్ద వరదను పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు











ఎల్లంపల్లి గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదలవుతున్న నీరు, నీట మునిగిన రాళ్లవాగు కాజువే వంతెన, మత్తడి దూకుతున్న గొల్లవాగు ప్రాజెక్టు, మంచిర్యాల గోదావరి నది వద్ద చూసేందుకు వచ్చిన ప్రజలు, బెల్లంపల్లి 33వ వార్డులో ఇండ్లలోకి చేరిన నీరు


బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ కులాల నాయకులు

నస్పూర్, సెప్టెంబరు 2: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌కు అందించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీసీ కులాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలసీదారులకు సేవలందించడంలో ఎల్ఐసీ భేష్



మాట్లాడుతున్న ఐడీబీఐ బ్యాంకు హెడ్ కె. రాఘవేంద్రరావు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 2: పాలసీదారులకు సేవలందించడంలో ఎల్ఐసీ అగ్రగామిగా నిలిచిందని ఐడీబీఐ బ్యాంకు హెడ్ కె.రాఘవేంద్రరావు పేర్కొన్నారు. ఎల్ఐసీ ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాలలో జరిగిన వారోత్సవాల ప్రారంభ సభలో మాట్లాడారు. సింగరేణి కార్మికుల క్లెయిముల చెల్లింపులో ఎల్ఐసీ ముందుందన్నారు. మంచిర్యాల చీఫ్ మేనేజర్ విశ్వేశ్వర్ మాట్లాడుతూ పాలసీదారులకు 98 శాతం క్లెయిములు చెల్లిస్తున్నామన్నారు. మంచిర్యాల బ్రాంచ్ అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ సత్యప్రసాద్, అనిత, బ్రాంచ్‌మేనేజర్ నందిగాం శ్రీనివాసరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ గోపతి మల్లేష్, నరేష్, సతీష్, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య

- బసవన్నల అలంకరణ
- ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు



నెన్నెలలో ఎద్దులకు పూజలు చేస్తున్న రైతు దంపతులు

నెన్నెల, సెప్టెంబరు 2: అన్నదాతకు సాగులో తోడుండే మూగజీవాలను కొలిచే పొలాల అమావాస్యను సోమవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పూల దండలు, గజ్జెలు, కొత్త కన్నాలతో బసవన్నలకు ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. ఎడ్లతో దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించారు.

అనంతరం బసవన్నలను ఆలయాలకు తీసుకెళ్లారు. పల్లెలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని దైవాన్ని వేడుకున్నామని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయేతర కుటుంబాల వారు మట్టితో చేసిన ఎడ్ల ప్రతిమలను ఇళ్లల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు. పండగను ఐదు రోజులు ఘనంగా జరుపుకుంటామని నేతకాని కులస్తులు తెలిపారు.

కోటపల్లి: పొలాల అమావాస్య పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ దేవతలైన పోచమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. మరో వైపు మట్టితో తయారు చేసిన ఎడ్లకు ఇండ్లలో పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ ఎద్దులను అలంకరించి దేవాలయాల్లో ప్రదక్షిణ నిర్వహించారు. రైతులు సంతోషంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

మందమర్రిరూరల్:ఆదిల్‌పేట మామిడిగట్టు, వెంకటాపూర్ గ్రామాల్లో పొలాల అమావాస్య పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆవులు, ఎద్దులకు స్నానాలు చేయించి అందంగా అలంకరించి పూజలు చేసి నైవేద్యాలు తినిపించారు. గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

కాసిపేట, సెప్టెంబరు 2: అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ సూచించారు. సోమవారం కాసిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి రికార్డులు, రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖపరంగా చర్యలుంటాయన్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ రవికికరణ్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామకృష్ణాపూర్, సెప్టెంబరు 2: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. సోమవారం బలహీనవర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే అలవాట్లు యువత పాలిట శాపాలుగా మారుతున్నాయన్నారు. విద్యార్థులు, యువత వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. అధ్యక్షుడు రాజలింగు మోతె, సభ్యులు సాయి, వెంకటస్వామి, బాబురావు, మర్రిస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఐ, తదితరులు